క్లుప్తంగా

నేడు మహిళలకు వంటల పోటీలు



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు మహిళలకు పౌష్టికాహార వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ శ్రావణి తెలిపారు. అమరావతి రోడ్డులోని ఓ మాల్‌లో శుక్రవారం మహిళలకు పౌష్టికాహార వంటలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ వంటల పోటీలో పాల్గొనే మహిళలు ఇంటి దగ్గరే ఆహార పదార్థాల్ని తయారుచేసుకుని రావాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త సిమ్రాన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రసన్న, రాధిక, శివరంజని, మహిళలు పాల్గొన్నారు.

నేడు రాపోర్టు షూమార్ట్ ప్రారంభం



పాత గుంటూరు: లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో రాపోర్టు ఎక్స్‌క్లూజివ్ షూ స్టోర్‌ని శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బోడేపూడి తేజ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం షోరూంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథులుగా పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. షోరూంలో జాతీయ, అంతర్జాతీయ బ్రాండెడ్ షూ, చప్పల్స్‌లభిస్తాయని పేర్కొన్నారు. రాపూర్ట్ ఎక్స్‌క్లూజివ్ షోరూంలు విజయవాడ, హైదరాబాదులలో ఉన్నాయని నేడు గుంటూరులో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో న్యూ ప్రాజెక్ట్ మేనేజర్ బి.పేరయ్య, జోనల్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి, రాపోర్ట్ స్టోర్ మేనేజర్ శ్రీనివాస్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా శిక్షించబడతారని క్రాఫ్ ఎన్జీవో సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ సీహెచ్ పద్మజ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోస్టర్ల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు యత్నం : కేసు నమోదు

ప్రత్తిపాడు : భూ ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్తిపాడు పోలీసు స్టేషనులో శుక్రవారం కేసు నమోదైంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. గుంటూరు ఆర్.అగ్రహారానికి చెందిన వినోద్‌కుమార్ జైన్ 18 సంవత్సరాల కిందట ప్రత్తిపాడు మండలం నడింపాలెం పరిధిలో ఆరున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమిలో 3.80 ఎకరాలను స్థానికంగా నివసించే ఆలేటి ప్రభావతితో పాటు మరికొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో కొద్దిరోజుల కిందట ఫెన్సింగ్ వైర్లు కట్ చేశారని, భూమి చుట్టూ ఎమ్మార్పీఎస్ జెండాలు పాతారని వినోద్ కుమార్ జైన్ శుక్రవారం ప్రత్తిపాడు పోలిస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన శిక్షణ శిబిరం

గుంటూరు రూరల్: సాంకేతిక నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. నాలుగు రోజులుగా లాం నందున్న కళాశాలలో బ్లాక్‌చైన్ టెక్నాలజీపై శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యంతో ప్రపంచంతో పోటీ పడే విధంగా ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాల ద్వారా ప్రతి విద్యార్థి మెలకువలు తెలుసుకోవచ్చన్నారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జె.భార్గవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై రోజువారీ నివేదిక ఇవ్వండి

ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల పురోగతిపై రోజువారీ నివేదిక ఇవ్వాలని, జాప్యం లేకుండా నిర్దేశిత గడువు మేరకు వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెండర్ పొందిన పనుల్ని నిర్దేశిత గడువు మేరకు జరిగేలా చూడాలని ఏఈలకు చెప్పారు. పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. నాణ్యతలో రాజీ లేదని, ఎక్కడైనా లోపం గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులు వేగంగా జరగాలని, పూర్తయిన వాటికి బిల్స్ అప్‌లోడ్ చేయాలని చెప్పారు. నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజోపయోగ పనుల నిర్వహణకు ఏడీహెచ్, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనల్ని ఏఈల వారీగా సిద్ధం చేయాలని ఆమె సూచించారు. రోడ్ల విస్తరణ పనుల్ని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. చెత్త తరలింపు ఈ- ఆటోల జీపీఎస్ రిపోర్ట్ ప్రతి రోజు పంపాలని, ఎక్కడైనా చార్జింగ్ పాయింట్స్ సమస్య ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాఠశాలల్లో నాడు - నేడు పనుల పురోగతిపై ఈఈల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తరగతులు జరుగుతున్నందున, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు. 15వ ఫైనాన్స్, ఎన్.క్యాప్ నిధులతో చేపట్టే పనులు నిర్దేశిత గడువు మేరకు జరిగేలా ఆయా ప్రాంత డీఈఈలు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఏఈలు తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులు కూడా పైపులైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సమావేశంలో ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే ముస్తఫా



మొక్కలు నాటుతున్న ముస్తఫా మేయర్ కావటి

పట్నంబజారు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే ముస్తఫా తెలిపారు. తూర్పు నియోజకవర్గంలోని 15 డివిజన్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడితో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్, కార్పొరేటర్లు ఆబీద్, వంశీ, మీరావలి, వైఎస్సార్ సీపీ నేత షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు.

బ్రహ్మానందరెడ్డి స్టేడియం పరిశీలన

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా శుక్రవారం బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో పర్యటించారు. స్టేడియం అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. స్టేడియంలోని సైడు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, ఎక్కడికక్కడ చెత్త నిల్వలు ఉండటంతో అధికారులు, సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు చేసి, పూడికతీత తీయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మీరావలి, వైఎస్సార్ సీపీ నేతలు రాంబాబు, ఫరూక్, ఖాశీం పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రభుత్వం కృషి

- ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు
- అమ్మఒడి, ఫీజుల చెల్లింపుతో చదువులకు ప్రోత్సాహం
- సమష్టిగా ముందుకెళ్లినప్పుడే సమాజాభివృద్ధి



భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడును సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలను సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ముఖాముఖీలో మాట్లాడారు. వర్గ భేదాలు లేకుండా సమష్టిగా ముందుకు వెళ్లినప్పుడే అభివృద్ధికర సమాజాన్ని చూడగలమని తెలిపారు. విద్యార్థులు రోజులో గంటను క్రీడల కోసం కేటాయించాలని, అప్పుడే దేహదారుఢ్యంతో పాటు భావి క్రీడాకారులుగా రాణించగలరని ఆయన సూచించారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలతో పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలు, తీరుతెన్నుల్ని ఇంటర్ విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. సాధారణ ఫీజులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఏసీ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. తన తండ్రి అంబటి సాంబశివరావు ఏసీ కళాశాల పూర్వ విద్యార్థి అని చెప్పేందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, అత్యున్నత భావాలతో సమాజాన్ని తద్వారా రాష్ట్ర, దేశాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు వివరణాత్మకమైన సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎఫ్. పరదేశి బాబు అంబటి రాయుడుకు అభినందనలు తెలియజేశారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీఏ శాలిని, డాక్టర్ జీఏ ప్రీతం ప్రకాష్, డాక్టర్ బి.విజయ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ విజయ్ శేఖర్, డాక్టర్ పీఎం వినయతేజ, డాక్టర్ ఎం.రత్నరాజ్, డాక్టర్ మార్కస్ ప్రదీప్, డాక్టర్ ఏజే భాగ్యలత, ఎన్‌సీసీ అధికారులు కె. రవి, ఎల్. సాగర్, ఆఫీస్ మేనేజర్ డి.వెంగయ్య పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. గుంటూరు కొరిటెపాడులోని సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఆఫీసులో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబటి రాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రక్తదాతలకు ఉచితంగా ఇన్సూరెన్స్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సూట్స్ కేర్ నెట్‌వర్క్ సేవలు అభినందనీయమన్నారు. సూట్స్ కేర్ నెట్‌వర్క్ డైరెక్టర్ కంకర నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామ తెలిపారు. రక్తదాతల్ని ప్రోత్సహించేందుకు ఉచితంగా ఇన్సూరెన్స్ కార్డును అందిస్తున్నామని చెప్పారు. సేవియో పేరుతో అందిస్తున్న ఈ కార్డు ద్వారా మూడు లక్షల రూపాయలు వరకు వ్యక్తిగత ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. ఇన్‌కేస్ ఆఫ్ ఎమర్జెన్సీ (ఐసీఈ)కార్డును నూతనంగా ప్రారంభించారు. ఈ కార్డు ద్వారా ప్రమాద సమయంలో మనం ఎవరు, మనకు ఎవరు ఉన్నారనే విషయాలు తెలుస్తున్నాయని, రోగి ప్రాణాలు కాపాడేందుకు ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రిన్స్ అభిషేక్, న్యూ ఎలైట్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ దీప్తి ప్రవల్లిక, డాక్టర్ సుభాష్, డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పుష్కలంగా మందులు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



న్యూరోసర్జరీ వైద్యులను అభినందిస్తున్న సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మందుల కొరత లేకుండా చేస్తున్నామని, అలాంటప్పుడు జనరిక్ మందుల షాపుతో పనేమిటని నిర్వాహకుల్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం క్యాజువాలిటీలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పక్కనే ఉన్న జనరిక్ షాపును ఆయన పరిశీలించి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా 17 వైద్య కళాశాలల్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్ని బలోపేతం చేస్తున్నారని చెప్పారు. ఆస్పత్రి నోడల్ ఆఫీసర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కూడా ఆస్పత్రులకు మందులు వెంటనే సరఫరా చేయాలని, అన్ని మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితిల్లో ఆస్పత్రిలో జనరిక్ మందుల షాపు అవసరం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ శ్రావణ్ ఉన్నారు.


రెండువేల సిరంజీలు అందించిన న్యూరోసర్జరీ వైద్యులు

గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జరీ వైద్యులు శుక్రవారం ఆస్పత్రికి రెండువేల సిరంజీలు అందజేశారు. న్యూరో సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గొల్ల రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సురేంద్రవర్మ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సత్యవనమణి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి సిరంజీలు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: నగరంలోని పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర డీఈ శ్రీనివాసబాబు శుక్రవారం చెప్పారు. పలు సెక్షన్లలో మరమ్మతుల రీత్యా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

నిరంతర సాధనే విజయానికి సూత్రం



గుంటూరు ఎడ్యుకేషన్: నిరంతర సాధనే విజయానికి సూత్రమని ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం "ఉద్యోగంలో దశలు-కావాల్సిన నైపుణ్యాలు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగి ప్రాథమిక దశలో నేర్చుకునే స్వభావం అవసరమని, అనుభవజ్ఞులైన తోటి సిబ్బంది నుంచి పని విధానాన్ని నేర్చుకోవాలని సూచించారు. పని చేస్తున్న సంస్థపై అభిమానంతో ఉండాలని తెలిపారు. తన 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవంలో చోటు చేసుకున్న పలు సంఘటనల్ని విద్యార్థులకు వివరించారు. వృత్తి, వ్యాపారాల్లో ఎదుగుతున్న సమయంలో మానవ సంబంధాలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని, తోటి సిబ్బందిని గౌరవిస్తూ వారిలోని ప్రతిభను గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి. కల్యాణి, సీహెచ్. వేదవతి, మణికంఠ, బి. అనిత పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు !

కానిస్టేబుల్ రమేష్‌బాబు కుటుంబానికి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ హామీ



కానిస్టేబుల్ రమేష్‌బాబుని పరామర్శిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ కె.సుప్రజ

నగరంపాలెం: గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రమేష్‌బాబు కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని వేళల్లో అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చెప్పారు. ఈనెల 5న తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో దుండగుల్ని పట్టుకునే ప్రయత్నంలో అత్యంత ధైర్యసాహసాల్ని ప్రదర్శించి, గాయాలై గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబు చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ శుక్రవారం మరోసారి ఆసుపత్రికి వెళ్లారు. కానిస్టేబుల్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఎస్పీ ఆరా తీశారు. మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెప్పారు. ఎప్పటికప్పుడు అతని ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షించాలని పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి కొంత వరకు మెరుగుపడినట్లు వైద్యులు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ సుభాష్, సీఐ బి.నరసింహారావు (ఎస్బీ), నగరంపాలెం పీఎస్ సీఐ హైమరావు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

సహచర హోంగార్డుల కుటుంబాలకు ఒక రోజు వేతనాన్ని అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ప్రశంసించారు. హోంగార్డుగా ఉద్యోగ విరమణ చేసిన ఆర్వీఎస్ఆర్కే శర్మకు రూ.2.31 లక్షల చెక్కు, ఇటీవల అనారోగ్యంతో హోంగార్డు దానాల రమణ మరణించగా, ఆమె కుమార్తె చల్లా దుర్గకు రూ.2.30 లక్షల చెక్కును శుక్రవారం డీపీవో ఆవరణలో ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరరావు (ఏఆర్), శ్రీనివాసరావు (క్రైం) డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'చిప్స్' ఫార్మసీలో ఘనంగా స్నాతకోత్సవం



గుంటూరు రూరల్: గ్రాడ్యుయేషన్ తరువాత విద్యార్థులు నిర్దేశించుకునే లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ వరప్రసాదమూర్తి సూచించారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎన్‌యూ రెక్టార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాల్ని ఏర్పరచుకుని వాటి సాధన దిశగా కృషిచేయాలన్నారు. జిల్లా డెప్యూటీ కలెక్టర్ సాయిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులంతా లక్ష్యాన్ని సరైన సమయంలో నిర్ణయించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. విద్యాధర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు పలు ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 2022-23 విద్యా సంవత్సరంలో బీ ఫార్మసీ, డీ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణ, కళాశాల ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, అదనపు కార్యదర్శి చుక్కపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

త్యాగధనుల్ని స్మరించుకోవడం అందరి బాధ్యత



మరియమ్మను సత్కరిస్తున్న వీఆర్ జ్యోత్స్నకుమారి, సత్యం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల్ని స్మరించుకోవడం మన బాధ్యతని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాలలో శుక్రవారం మన భూమి-మన దేశం కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాంధేయవాది వావిలాల గోపాలకృష్ణయ్య సోదరుని తనయుడు వావిలాల సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో వావిలాల గోపాలకష్ణయ్య పాత్ర, నిరాడంబరత, నిస్వార్థ సేవ, వివిధ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర గురించి విద్యార్థినులకు వివరించారు. చైనాతో జరిగిన యుద్ధంలో అతి చిన్న వయసులోనే ప్రాణాల్ని కోల్పోయిన సైనికుని భార్య కె. మరియమ్మ తన భర్త త్యాగం గురించి వివరించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి. లలితాబాయి, డాక్టర్ ఆర్. అనురాధ, బి. క్యూరీ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థి నాయకులతో శివాజీ, విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అవర్చుకోవాలని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సూచించారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకొన్న పాఠశాల హెడ్‌బాయ్ జతిన్ స్వరాజ్, హెడ్ గర్ల్ చరణ్య తేజస్వినితో ప్రమాణ స్వీకారం చేయిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, భావిభారత పౌరులుగా ఎదిగేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడి మృతి



ప్రత్తిపాడు: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు వివరాల మేరకు.. బోయపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపై అండర్ పాస్ వద్ద గుర్తుతెలియని ఓ వృద్ధుడు నీరసించి పడిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వృద్ధుడు చికిత్స పొందుతూ ఈ నెల 9న మృతిచెందాడు. ప్రత్తిపాడు ఎస్ఐ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చుట్టుపక్కల విచారించినప్పటికీ మృతుడి ఆచూకీ లభించలేదు. మృతుని వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, చామన ఛాయ రంగులో 5.6 అడుగులు ఉంటాడని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8988 831386 లేదా 0863 2280233 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన ఉపకరణాల పంపిణీ



చిన్నారికి కిట్లు అందజేస్తున్న ఏపీసీ విజయలక్ష్మి, రాజేంద్ర, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాలు పిల్లలు సాధారణ విద్యార్థులతో ఉండడం ద్వారా వారు లోపాలు, సమస్యల నుంచి బయటపడగలరని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త ఏ. విజయలక్ష్మి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రాంగణంలో ఉన్న సమగ్రశిక్ష భవిత కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన ఉపకారణాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ బోధన ఉపకారణాల ద్వారా విద్యను పిల్లలకు మరింత సులభంగా అందించవచ్చని తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన నిప్పిడి సంస్థ అందజేస్తున్న విలువైన బోధన ఉపకరణాల్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా బుద్ధి మాంద్యం గల పిల్లలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. జాతీయ మేధావర సాధికార సంస్థ ప్రతినిధి రాజేంద్ర మాట్లాడుతూ పిల్లలకు వారి వయసు ఆధారంగా మూడు రకాల కిట్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఒక్కొక్కటి రూ.10వేల విలువైన 102 కిట్లు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి మూడేళ్ల ఒకసారి ప్రత్యేక అవసరాల పిల్లలకు కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



